కథ

# గృహప్రవేశం

**సత్య హాస్పిటల్‌లో నాలుగేళ్ళ కూతుర్ని ఒడిలో కూర్చోబెట్టుకొని డాక్టర్ పిలుపుకోసం ఎదురుచూస్తున్నాడు కార్తీక్.**

**టైము చూశాడు. పదకొండు గంటలైంది. పన్నెండుకి కాలేజీలో తన క్లాసు ఉంది. ఆలోగా తను వచ్చిన పని అయిపోతే బాగుణ్ణు అనుకున్నాడు. ఇంతలో అతని దృష్టి అప్పుడే హాస్పిటల్‌లోకి అడుగుపెట్టిన స్త్రీపై పడింది. పాతికేళ్ళ వయసుంటుంది ఆమెకు. చాలా అందంగా ఉంది. చేతిలో సుమారు రెండేళ్ళ వయసున్న బాబు. ఆమె కార్తీక్ ఎదురుగా ఉన్న బెంచీపై కూర్చుంది. నుదుట బొట్టు లేదు. ఆమె మొఖంలో దైన్యం.**

ఇంతలో నర్సు వచ్చి 'విశాల' అని పిలిచి లోపలికి వెళ్ళిపోయింది. కార్తీక్ కూతుర్ని ఎత్తుకొని లోపలికి వెళ్ళాడు. అతని వెనకే ఆమె కూడా బాబును ఎత్తుకొని లోపలికి అడుగుపెట్టింది.

బేసిన్‌లో చేతులు వాష్ చేసుకొంటున్న డాక్టర్ హిమబిందు వాళ్ళిద్దర్నీ చూసి ''కూర్చోండి'' అంది నవ్వుతూ. సిటీలో మంచి పేరున్న పీడియాట్రీషియన్ ఆమె.

ఇద్దరూ కుర్చీల్లో కూర్చున్నారు. డాక్టరు కూడా కూర్చొని ''అందమైన జంటకి అందమైన పిల్లలు'' అంటూ కాంప్లిమెంట్ యిచ్చింది. కార్తీక్, ఆమె ఒకరి మొహాలొకరు చూసుకొన్నారు.

వాళ్ళు అలా చూసుకోవడం చూసి ''ఈ పిల్లలు మీ పిల్లలే కదా'' అని అడిగింది అనుమానంగా.

''వీడు మా అబ్బాయి'' అంది ఆమె.

''పాప నా కూతురు'' అన్నాడు కార్తీక్.

''అంటే మీరిద్దరూ భార్యాభర్తలు కారా?''

కాదన్నట్టు తల అడ్డంగా ఊపారు యిద్దరూ.

''మరి యిద్దరూ లోపలికి ఒకేసారి ఎలా వచ్చారు? నీలిమా. ఇద్దర్ని పేర్లు పిలిచావా నువ్వు?'' అని నర్స్‌ని అడిగింది హిమబిందు.

'''లేదు డాక్టర్. విశాల అని పిలిచాను'' అంది నర్స్ తనకూ అర్థం కానట్టు మొఖం పెట్టి.

బాబు తల్లికి విషయం అర్థమైంది.

''సారీ మా అబ్బాయి పేరు విశాల్. వాడి పేరు పిలిచారని లోపలికి వచ్చాను'' అంటూ వెళ్ళబోయింది.

''ఫర్వాలేదు మీ బాబును చూపించండి'' అంటూ బయటకు వెళ్ళిపోయాడు కార్తీక్.

''అయామ్ ఎక్స్‌ట్రీమ్లీ సారీ'' అంటూ నొచ్చుకుంది హిమబిందు. తర్వాత ''మీ పేరు'' అని ఆమెని అడిగింది.

''అర్చన''

''మీ వారు రాలేదా?''

''ఆయన లేరు. సంవత్సరం క్రితం పోయారు''

''సారీ'' అంది బాధగా హిమబిందు.

''చెప్పండి. ఏమిటి కంప్లైంట్''

''బాబుకు నిన్నట్నుంచీ జ్వరం''

బాబును చూసి మందులు రాసిచ్చి పంపాక కార్తీక్‌ను లోపలికి పిలిపించింది.

''మీ పేరు?''

''కార్తీక్''

''మీ ఆవిడ రాలేదా?''

''లేదు''

''ఊర్లో లేరా?''

''ఈ లోకంలో లేదు''

''ఐ యామ్ సారీ'' మళ్ళీ అంది బాధగా. తను మొదటిసారి వాళ్ళను చూడగానే అందమైన జంట అనుకొంది. దురదృష్టవశాత్తూ ఇద్దరూ తమ జంటని కోల్పోయిన వాళ్ళే. భగవంతుని దయవల్ల వీళ్ళిద్దరికీ జంట కలిస్తే బాగుంటుంది' అనుకొంది హిమబిందు.

పాపను చూసి మందులు రాసిచ్చింది. కార్తీక్ ఫీజు చెల్లించి మెడికల్ షాపునకు వెళ్ళాడు. హాస్పిటల్‌కు అనుకొనే ఉంది ఆ షాపు. అక్కడ అర్చన మందులు కొంటూంది.

''సారీ మీకు యిబ్బంది కలిగినట్లుంది'' అన్నాడు ఆమెతో.

''తప్పునాదే. పేరు సరిగ్గా వినకుండా లోపలికి వచ్చేశాను. మీకు యిబ్బంది కలిగించాను''

''ఇబ్బందేం లేదు. బహుశా మనం ఒకరికొకరు పరిచయం అవ్వాలని రాసి పెట్టి ఉండటం వల్ల అలా జరిగి ఉండొచ్చు. నా పేరు కార్తీక్. లెక్చరర్‌గా పనిచేస్తున్నాను''

''నా పేరు అర్చన. నేను టీచర్ని''

''మీ వారు?''

''లేరు''

''సారీ. నేనూ ఒంటరివాడ్నే. విశాల తల్లి లేని పిల్ల''

''ఉంటానండి'' అంటూ వెళ్ళిపోయింది అర్చన.

మందులు కొని కార్తీక్ స్కూటరు వైపు నడిచాడు, కూతురు విశాలతో.

★ ★ ★

లిటిల్ ఫ్లవర్ కాన్వెంట్‌లో బాబును చేర్పించి బయటకు వచ్చింది అర్చన. కార్తీక్ ఎదురొచ్చాడు ఆమెకు.

''హలో విశాల్‌ను చేర్పించడానికి వచ్చారా?'' అంటూ పలుకరించాడు.

''అవును. మీరు?''

''విశాల యిక్కడే చదువుతూంది. ఈరోజు స్కూలు రీ ఓపెనింగ్ డే కాబట్టి ఫీజు కట్టడానికి వచ్చాను. మీ పని పూర్తయిందా''

లేదన్నట్టు తల అడ్డంగా ఊపింది.

''ఇక్కడ పనిచేసే వాళ్ళంతా నాకు బాగా తెలిసినవాళ్ళే. ఏదైనా అవసరమయితే చెప్పండి''

''విశాల్ అడ్మిషన్ అయింది. కానీ నా పని ఒకటి ఉంది. ప్రస్తుతం నేను పనిచేసే స్కూల్లో జీతం చాలా తక్కువ యిస్తున్నారు. ఈ స్కూల్లో జీతాలు బాగా యిస్తారని విన్నాను. అందువల్ల యిక్కడ ఖాళీలేమైనా ఉన్నాయేమో కనుక్కొందామనుకొంటున్నాను''

''ఉండండి. నేను ప్రిన్స్‌పాల్‌తో మాట్లాడి వస్తాను'' అంటూ వెళ్ళిపోయాడు.

పది నిమిషాల తర్వాత వచ్చి ''విజిటర్స్ రూంలో కూర్చోండి. అరగంట తర్వాత మిమ్మల్ని యింటర్వ్యూ చేస్తారు. నచ్చితే మిమ్మల్ని ఉద్యోగంలో తీసుకొంటారు. ఈరోజు మంచిరోజు. ఈరోజే ఉద్యోగంలో చేరిపొండి. నా పేరు రెఫర్ చెయ్యండి'' అన్నాడు.

అతడలా చకచకా అన్నీ జరిగిపోతున్నట్లే

మాట్లాడటం ఆమెను ఆశ్చర్యపరచింది.

''నేను సర్టిఫికెట్స్ తీసుకురాలేదు. ఊరికే అడిగిపోదామని వచ్చాను''

''సర్టిఫికెట్స్ అవసరం లేదు. మీరేం చదివారో ఎక్కడ పని చేస్తున్నారో చెప్పండి. మీ గురించి సర్టిఫికేట్ నేనిచ్చాను వాళ్ళకు''

''ఏమిటి?''

''మీరు కమిట్‌మెంట్ ఉన్న వ్యక్తి అని. ఎందుకో మిమ్మల్ని చూస్తే అలా అనిపించింది. నాకు కాలేజ్‌కు టైమయింది. బెస్టాఫ్‌లక్'' అంటూ వెళ్ళిపోయాడు.

అర్చనకు ఆ స్కూల్‌లో ఉద్యోగం దొరికింది.

కార్తీక్ స్కూలుకు వచ్చినప్పుడల్లా అర్చనను కలిసి మాట్లాడేవాడు. ''నా బ్యాంక్ అకౌంట్స్ నాంపల్లిలోని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఉన్నాయి. ప్రస్తుతం నేను స్కూలుకు దగ్గరగా ఉంటుందని మలక్‌పేటలో ఉంటున్నాను. అవి యిక్కడి బ్రాంచికి ట్రాన్స్‌ఫర్ చేయించాలి. మీకు ఆ బ్యాంకులో తెలిసిన వాళ్ళెవరైనా ఉన్నారా?'' అని ఒకరోజు కార్తీక్‌ను అడిగింది అర్చన.

''తెలిసినవాళ్ళు లేరు. కానీ మా కాలేజీ నాంపల్లిలోనేగా. మీరు పాస్‌బుక్కు, లెటరూ యిచ్చారంటే నేను ట్రాన్స్‌ఫర్ చేయిస్తాను''

''మీకు యిబ్బందేం లేదుగా''

''ఉంటే ఒప్పుకోనుగా''

అర్చన నవ్వి ''రేపు తెచ్చి స్కూల్లోనే ఉంచుతాను. మీరు ఈసారి స్కూలుకు వచ్చినప్పుడు మీకిస్తాను'' అంది.

ఆమె సేవింగ్స్ బ్యాంక్ అక్కౌంటును, ఫిక్స్‌డ్ డిపాజిట్లనూ మలక్‌పేట బ్రాంచికి ట్రాన్స్‌ఫర్ చేయించాడు. పాస్‌బుక్, డిపాజిట్ రిసీట్స్ ఆమెకిస్తూ.


''అంత డబ్బు తక్కువ పీరియడ్‌కు డిపాజిట్ చేశారేం. పీరియడ్ ఎక్కువ చేస్తే వడ్డీ ఎక్కువ వస్తుందిగా'' అన్నాడు.

''నిజమే. అయితే నేను ఓ ఫ్లాటు కొనాలని అనుకొంటున్నాను. అందుకోసం డబ్బు అవసరమౌతుందని తక్కువ కాలానికే డిపాజిట్ చేశాను'' అంది.

''ఫ్లాటు కోసం ప్రయత్నిస్తున్నారా?''

''అవును. కానీ నాకు స్నేహితులు తక్కువ. బంధువులు పెద్దగా ఎవరూ లేరు. ఇటువంటి విషయాల్లో నాకు సహాయం చేసేవాళ్ళు లేరు''

''ఫర్వాలేదు. నేను మీ స్నేహితుడినే. నేను దిల్‌షుక్‌నగర్‌లో ఓ ఫ్లాటు కొంటున్నాను. బిల్డర్ మంచి పేరున్నవాడు. నమ్మకస్థుడు. మీరు నాతోపాటు ఓసారి వచ్చారంటే అతనితో మాట్లాడదాము''



''థాంక్యూ. తప్పకుండా వస్తాను''

కార్తీక్ కొంటున్న ఫ్లాటు ప్రక్క ఫ్లాటే అర్చనకు అమ్మడానికి ఒప్పుకున్నాడు బిల్డర్.

★ ★ ★

''ఈరోజు విశాల పుట్టినరోజు. మీరు మా యింటికి రావాలి''

''పార్టీ యిస్తున్నారా''

''పార్టీలాంటిదే. సాయంత్రం ఆరుగంటలకు. విశాల్‌ను కూడా తీసుకురండి''

''సారీ అండి. ఆయన పోయాక నేను పార్టీలకు అటెండ్ అవడం లేదు. నన్ను మన్నించండి''

''పార్టీకి నేను వేరెవర్నీ పిలవడం లేదు. మీరూ, నేనూ, పిల్లలు. అంతే'' అర్చన కార్తీక్ వైపు ఆశ్చర్యంగా చూసి ఆలోచనలో పడింది.

**సి.ఎన్.చంద్రశేఖర్**

''మీరేం సందేహించకండి. ఓ స్నేహితుడిగా మిమ్మల్ని పిలుస్తున్నాను. మీకు యిబ్బంది అయితే వద్దులెండి''

''ఇబ్బందేం లేదు. వస్తాను''

సాయంత్రం కొడుకుతో కార్తీక్ చెప్పిన అడ్రసు వెతుక్కొని అతనింటికి వెళ్ళింది అర్చన. విశాలకు గిఫ్ట్ యిచ్చి బర్త్‌డే గ్రీటింగ్స్ చెప్పింది. ఆమె వచ్చినందుకు ఎంతో సంతోషించాడు కార్తీక్.

పాప కేక్ కట్ చేశాక నలుగురికీ కేకు, స్వీటు ప్లేట్లలో పెట్టి తెచ్చాడు. అవి తిన్నాక అర్చనకు ఇల్లు చూపించాడు.

''అద్దె ఇల్లే అనుకోండి. ప్రస్తుతానికి మా ఇల్లే''

డైనింగ్ హాల్లో గోడకు తగిలించి ఉన్న ఫొటోలోని స్త్రీని చూసి నిశ్చేష్టురాలయింది.

''ఆవిడ.. మీ ఆవిడా?''

''అవును. ఆమె మీకు తెలుసా?''

''ఆవిడ పేరు సులోచన కదూ?''

''అవును..మీకెలా తెలుసు?''

''నా స్నేహితురాలికి ప్రాణ స్నేహితురాలు ఆవిడ''

కొంతసేపు ఇద్దరూ నిశ్శబ్దంగా ఉండిపోయారు. ఆనందంగా ఉన్న వాతావరణం సీరియస్‌గా మారిపోయినట్లు గ్రహించాడు కార్తీక్.

''ఏమిటలా అయిపోయారు? ఆమె పోయిన విషయం మీకు తెలియదా?''

''తెలుసు. ఎందుకు పోయిందో కూడా తెలుసు. ఇక నేను బయలుదేరుతాను. విశాల్'' అంటూ కొడుకుని పిలిచింది.

''మీరేదో దాస్తున్నారు. మీకేం తెలుసో చెప్పండి. సులోచన ఎందుకు పోయిందుకొంటున్నారో చెప్పండి''

''అవసరం లేదు. ఎటూ ఆవిడ లేరుగా. ఇక ఆ విషయం గురించి మాట్లాడటం అనవసరం. థాంక్యూ ఫర్ ద పార్టీ. వస్తాను''

వెళ్ళిపోతున్న ఆమె వైపే చూస్తూండిపోయాడు కార్తీక్.

★ ★ ★

ఆ తర్వాత స్కూల్‌లో కార్తీక్ ఎదురుపడ్డా మాట్లాడలేదు అర్చన. ముభావంగా నవ్వి వెళ్ళిపోయేది. సులోచన తమ మధ్య జరిగింది తన ప్రాణ స్నేహితురాలికి చెప్పి ఉంటుందని, ఆమె ద్వారా అర్చనకు తెలిసి ఉంటుందని గ్రహించాడు కార్తీక్. సులోచన ప్రాణ స్నేహితురాలు పద్మావతి. బహుశా పద్మావతి, అర్చన స్నేహితురాళ్ళు అయి ఉంటారు.

స్కూల్‌డే రోజున కార్తీక్ స్కూలుకెళ్ళాడు. ఆ రోజు విశాల డాన్స్ ప్రోగ్రాము ఉంది. అది చూడటానికే కాక అవకాశం దొరికితే అర్చనతో మాట్లాడాలని కూడా ఉంది అతనికి. విశాల డాన్స్ అయ్యాక మెల్లగా ముందుకు నడుస్తూ ఒకచోట ఒంటరిగా నిలబడి ఉన్న అర్చనను చూసి ఆమెను సమీపించి ''విశాల డాన్స్ బాగా చేసింది కదూ'' అన్నాడు.

ఆమె తలత్రిప్పి అతన్ని చూసి ఉలిక్కిపడి, అంతలోనే సర్దుకొని ''అవును'' అంది.

''మీరు ఎందుకో యిదివరకటిలా లేరు నాతో. నా తప్పేమిటో తెలుసుకోవాలని ఉంది'' అన్నాడు.

''అలాంటిదేం లేదు. చూసేవాళ్ళు కథలల్లుతారని దూరంగా ఉంటున్నాను''

''ఆ ఆలోచన సులోచన ఫొటో చూశాక వచ్చిందా?''

ఆమె మాట్లాడలేదు.

''నాతో మాట్లాడటం, మాట్లాకపోవడం మీ యిష్టాలపై ఆధారపడి ఉండొచ్చు. కానీ 'ఈమె నా స్నేహితురాలు' అని నేను మనసులో గట్టిగా అనుకొనేలా ప్రవర్తించి, ఈ రోజు ఆ స్నేహాన్ని కట్ చేసే హక్కు మీకు లేదు. నా ప్రవర్తనలో ఏదైనా తప్పుంటే తప్పు''

''మీ తప్పొప్పుల గురించి మాట్లాడే హక్కు, చనువు నాకు లేదు''

ఇంతలో ఆమెని మరో టీచర్ పిలవడంతో 'వస్తానండీ' అంటూ వెళ్ళిపోయింది.

★ ★ ★

కాలింగ్ బెల్ మ్రోగితే తలుపు తీసిన అర్చనకు ఎదురుగా కార్తీక్ కనిపించాడు.

ప్రక్కకు జరిగి ''రండి'' అంటూ అయిష్టంగానే ఆహ్వానించింది.

అతను కుర్చీలో కూర్చొని ''బాగున్నారా? విశాల్ ఏడి?'' అని అడిగాడు.

''ప్రక్కింట్లో ఆడుకొంటున్నాడు''

రెండు నిమిషాలు యిద్దరూ మౌనంగా ఉండిపోయారు.

''మీరు సులోచన గురించి మాట్లాడటానికే వచ్చి ఉంటే ఐ యామ్ సారీ. నేను చాలా అలసిపోయి ఉన్నాను. మరోసారి ఆ విషయం మాట్లాడదాం'' అంది అర్చన.

దెబ్బతిన్నట్టు చూశాడు ఆమె వైపు. వెంటనే లేచి నిలబడి జేబులోంచి ఓ పాకెట్ ఆమెకిస్తూ ''ఇవి మీ కొత్త యింటి తాళాలు. సాయంత్రం నా యింటి తాళాలు తీసుకోవడానికి వెళ్ళాను. ఈ రోజు మంచిరోజని మీదీ తీసుకొన్నాను. రేపు మీరు వెళ్ళి వాళ్ళ రిజిష్టర్‌లో తాళాలు అందినట్లు సంతకం చేయండి. నేను వస్తాను'' అన్నాడు.

ఆమెకు ఒక్కక్షణం ఎంతో బాధవేసింది. తనకు ఇల్లు కొనాలని ఉందని చెప్పినప్పటినుంచి ఈ రోజు వరకు ఎంతో సహాయం చేసి, ఎన్నోసార్లు తిరిగి, తనను ఓ ఫ్లాటు ఓనర్ని చేశాడు కార్తీక్. కానీ తను అతని మనసు విరిగేలా ప్రవర్తిస్తూంది. సులోచన విషయంలో తనకు అనుమానాలు ఉండొచ్చు. కానీ తనతో మంచిగా ఉంటూ, మంచే చేస్తున్న అతన్ని బాధపెట్టే హక్కు తనకెక్కడుంది?

''సారీ. నాకోసం మీరు యింతగా కష్టపడుతుంటే నేను అలసట వల్ల ఏదేదో మాట్లాడి మిమ్మల్ని బాధపెట్టాను. నన్ను క్షమించండి. కూర్చోండి. నన్నే ఇంటిదాన్ని చేసిన శుభ సందర్భంలో స్వీట్ తిని వెళుదురుగాని'' అంది.

## గ్రేసీ భయం

**ఇండస్ట్రీలోకొచ్చిన కొత్తలో చాలామంది తారలు కొంచెం తొట్రుపాటు పడుతుంటారు. వారిలో కొందరు సినీ కుటుంబం నుంచి వచ్చినవారైతే కొంచెం నిలదొక్కుకోగలుగుతారు. 'లగాన్' చిత్రంతో బాలీవుడ్ ప్రపంచంలోకి అడుగుపెట్టిన గ్రేసీసింగ్ ఇలాంటి అనుభవలను ఎదుర్కొన్నానని చెబుతోంది. 'ఇండస్ట్రీలో ఎలా మెలగాలో నాకు తెలియదు. పరిస్థితుల్ని బట్టి మసలుకునే తత్వం ఈమధ్యే అలవడింది. ఇంతకుముందు చీటికీమాటికీ ఆవేశపడేదాన్ని. దానికంతటికీ కారణం నాలో ఉన్న అమాయకత్వం, భయమే' అంటోంది. 'కెమెరా ముందు నటించాక చాలాసేపు ఆ వాతావరణం నుంచి నేను బయటికి రాలేను. అవుడ్‌డోర్ షూటింగ్‌లంటే నాకు చాలా భయం. ఇప్పుడిప్పుడే నేను హేపీగా ఫీలవుతున్నాను' అని చెబుతోంది.**



''ఫర్వాలేదు. ఈ నెల పదహారున నేను గృహప్రవేశం చేస్తున్నాను. పిలవడానికి యింకోసారి మీ యింటికి వచ్చి మిమ్మల్ని యిబ్బంది పెట్టదలచుకోలేదు. ఉదయం అయిదు గంటలకు ముహూర్తం. తర్వాత సత్యనారాయణ వ్రతం కూడా చేస్తున్నాము. మీరు ఎనిమిది గంటలకు వచ్చినా ఫర్వాలేదు. విశాల్‌ను కూడా తీసుకు రండి'' అన్నాడు.

''తప్పకుండా వస్తాము''

''మీ టిఫినూ, భోజనం అక్కడే. వస్తానండీ'' అంటూ వెళ్ళిపోయాడు.

## అమీషా అక్కసు

**రాజకీయంగా కీలకమైన స్థానాల్లో ఉన్న కుటుంబ వాతావరణం నుంచి వచ్చిన సినీతారలపై వాటి ప్రభావం తప్పక పడుతుంది. అయితే ఆ వాతావరణానికి అలవాటుపడకుండానే తనకంటూ ఒక గుర్తింపుని తెచ్చుకున్న నటి అమీషా పటేల్. అమీషా తాత కాంగ్రెస్ నాయకుడు, అమ్మమ్మ కమ్యూనిస్టుపార్టీ లీడర్. అలాంటి అమీషా ఈమధ్య రాజకీయనాయకుల తీరుపై మండిపడ్డారు. కాలిఫోర్నియాలో ఈమధ్య పర్యటించిన అమీషా 'రాజకీయనాయకులు మోసగాళ్ళు, వంచకులు. అభివృద్ధి కంటే వారికి స్వప్రయోజనాలే ఎక్కువ' అంటోంది. 'కహోనా ప్యార్‌హై, గదర్-ఏక్ ప్రేమ్‌కథా' చిత్రాలు తన జీవిత గమనాన్నే మార్చేశాయని చెప్పే అమీషా వెరైటీ పాత్రలు చేయాలని ఉందంటోంది.**



కార్తీక్ వెళ్ళిపోయాక అతని గురించే ఆలోచిస్తూండిపోయింది. మానసికంగా తనకు ఎంతో దగ్గరైన అతను తను అతన్ని దూరం చేయడం భరించలేకపోతున్నాడు. అతను తనను ప్రేమిస్తున్నాడా? తిరస్కరించడానికి తనకేం కారణం కనిపించడం లేదు. కాని సులోచన తన స్నేహితురాలితో చివరిసారిగా ఫోనులో చెప్పిన మాటలు ఎంత మరచిపోవాలన్నా సాధ్యం కావడం లేదు.

''నా భర్త రెండో పెళ్ళి ప్రయత్నాలు మొదలుపెట్టాడు. ఆ ఊహే నేను భరించలేకున్నాను. అందుకే చచ్చిపోతున్నాను''

వెంటనే డైరీలో నెంబరు వెతికి బెంగుళూరులో ఉన్న పద్మావతికి ఫోన్ చేసింది. పద్మావతి లైన్లోకి రాగానే..

''పద్మా బాగున్నావా. నేను అర్చనని'' అంది.

''వాటె సర్‌ప్రైజ్. హైదరాబాదు నుంచేనా''

''అవును. నాకొక సందేహం తీర్చాలి నువ్వు. నీ ఫ్రెండ్ సులోచన ఆత్మహత్య చేసుకుంది కదా. ఆమె భర్త ఎటువంటివాడు?''

''ఆయన మంచివాడనే విన్నాను. సులోచనకు అహంకారం, నోరు ఎక్కువ. పైగా దేన్నీ తట్టుకోలేని మనస్తత్వం. నా అనాలసిస్ ప్రకారం ఆమె తొందరపడి, అనాలోచితంగా ఆత్మహత్య చేసుకొందిగానీ ఆమెను అలా ఆత్మహత్యకు ప్రేరేపించేలా ప్రవర్తించే మనిషి కాదు అతను''

''థాంక్యూ. ఈ విషయం ఎందుకు అడిగానో మళ్ళీ చెబుతాను. గుడ్‌నైట్'' అంటూ ఫోన్ పెట్టేసింది. ఇప్పుడు ఆమెకు ఎంతో తృప్తిగా ఉంది. 'కార్తీక్ చెడ్డవాడు కాడు. ఆ విషయం అతన్ని చూస్తే తెలుస్తున్నా పెళ్ళన్నది జీవితంలో అతి ముఖ్యమైన విషయం కాబట్టి అన్ని విషయాలు తెలుసుకొనే ముందడుగు వెయ్యాలి' అనుకొంది.

పదహారవ తేదీ ఉదయం ఎనిమిది గంటలకు అతనింటికి వెళ్ళింది అర్చన. సత్యనారాయణ స్వామి పూజ జరుగుతోంది. కార్తీక్ తల్లిదండ్రులు పీటలమీద కూర్చుని ఉన్నారు. అర్చనను చూసి నవ్వుతూ ఆహ్వానించాడు కార్తీక్. తను తెచ్చిన గిఫ్ట్ అతనికిచ్చి 'కంగ్రాచ్యులేషన్' అంది.

''థాంక్యూ''

బంధువులు, స్నేహితులు చాలామంది వచ్చారు. ఆమె తన యింటి కీస్ అతనికిస్తూ ''కూర్చోవడానికి స్థలం చాలకుంటే మా ఇల్లు కూడా వాడుకోండి'' అంది.

''థాంక్యూ'' అంటూ కీస్ అందుకొని వెళ్ళిపోయాడు.

పూజ అయ్యాక తన తల్లిదండ్రులకు అక్క గీతకు అర్చనను పరిచయం చేశాడు కార్తీక్.

''ప్రక్క పోర్షను మీదే అటగా, నాకు చూపించరూ'' అని గీత అడిగింది.

''తప్పకుండా రండి'' అంటూ అర్చన తన ఇల్లు గీతకు చూపించింది.

''చాలా బాగుంది. మంచి ప్లానింగ్‌తో కట్టారు''

''అంతా మీ తమ్ముడుగారే చూసుకొన్నారు. డబ్బులివ్వడం తప్ప ఏం చెయ్యలేదు నేను. ఆయన ఋణం ఈ జన్మలో తీర్చుకోలేను'' అంది అర్చన.

''గృహప్రవేశం ఎప్పుడు?''

''ఫంక్షన్‌లా చెయ్యను. మంచి రోజు చూసి పాలు పొంగించి చేరిపోతాను''

''ఇల్లు కట్టాక గృహప్రవేశం చేసి పదిమందికి భోజనం పెడితే మంచిదంటారు''

''నిజమే. కానీ కార్తీక్‌గారిలా నాకు అమ్మానాన్నా లేరు. తోబుట్టువులూ లేరు. ఎలా గృహప్రవేశం చెయ్యను?''

''మా కార్తీక్ ఉన్నాడుగా''

''అంటే?'' ఆశ్చర్యంగా చూస్తూ అంది అర్చన.

''కార్తీక్ నాతో అంతా చెప్పాడు. మీరు అతన్ని అసహ్యించుకొంటున్న విషయం కూడా చెప్పి బాధపడ్డాడు. సులోచన విషయం మీకు ఎవరు చెప్పారో, మీరు ఏం విన్నారో నాకు తెలియదు. కాని జరిగింది నాకు తెలుసు. అది మీకు చెప్పడం నా ధర్మం. నమ్మడం నమ్మకపోవడం మీ యిష్టం.

కార్తీక్ తన కాబోయే భార్య గురించి ఎన్నో కలలు కన్నాడు. ఆమె అందంగా ఉండాలని, తన వాళ్ళతో బాగా కలిసిపోవాలని. అందరి దగ్గరా మంచి పేరు తెచ్చుకోవాలని ఆశించాడు. వాడు కోరుకున్నట్లే అందమైన భార్యే దొరికింది. సులోచన

తన తల్లిదండ్రులకు ఏకైక కుమార్తె. వాళ్ళ గారాల పట్టి. చదువు, తెలివితేటలూ బాగా ఉన్నా వినయం శూన్యం. ఎదుటి మనిషిని అర్థం చేసుకునే తత్వం కాదు. ఆమె వల్ల కార్తీక్ ఎన్నో యిబ్బందుల్ని, అవమానాల్ని ఎదుర్కొన్నాడు. సులోచన ప్రతి విషయంలోనూ తన మాటే నెగ్గాలనేది. అందువల్ల రోజూ వాళ్ళ మధ్య తగవులూ, మనస్పర్థలూ వచ్చేవి. వాడే తగ్గి సర్దుకుపోయేవాడు. తన సంసార జీవితం గురించి ఎన్నో కలలు కని అవి కల్లలయ్యాక మొదట డీలా పడిపోయాడు.

ఆ తర్వాత కాంప్రమైజ్ అయిపోయాడు. కానీ సులోచన మా అమ్మానాన్నల్ని అవమానించడం సహించలేకపోయాడు.

ఎన్నో విషయాల్లో మా అమ్మానాన్నల మనసుల్ని నొప్పించేది. విశాల పుట్టాక ఆమె మరిన్ని సమస్యల్ని సృష్టించింది. పాపను అమ్మానాన్నల్ని ఎత్తుకోనిచ్చేది కాదు. ఆమె ఇంట్లో లేని సమయంలో మాత్రమే తమ మనవరాలిని ఎత్తుకొని ఆడించేవారు వాళ్ళు.

ఇంతలో కార్తీక్‌కు హైదరాబాద్ ఇప్పుడు పని చేస్తున్న కాలేజీలో ఉద్యోగం వచ్చింది. కర్నూలు నుంచి యిక్కడికి వచ్చి కొత్తకాపురం పెట్టాడు. మా నాన్న యింకా సర్వీసులోనే ఉన్నందువల్ల మా అమ్మానాన్నలు కర్నూలులోనే ఉండిపోయారు.

ఇక్కడికి వచ్చాక కూడా ఆమె ప్రవర్తనలో మార్పు రాలేదు. ఎప్పుడైనా మా అమ్మానాన్నలు పాపని చూడటానికి హైదరాబాద్ వస్తే, వాళ్ళు యింట్లో అడుగుపెట్టిన అయిదు నిమిషాలకు తను పాపతోపాటు బయటకు వెళ్ళి రాత్రి ఏ పదకొండు గంటలకో యిల్లు చేరేది.

కార్తీక్ ఆమె తన ప్రవర్తన మార్చుకోకపోతే విడాకులిస్తానని బెదిరించాడు. రెండో పెళ్ళి చేసుకొంటానని చెప్పాడు.

ఆమె పట్టించుకోలేదు. వాడు తన స్నేహితుడైన లాయరు ద్వారా విడాకుల నోటీసు యిప్పించాడు.

అయితే ఆమె ఆత్మహత్య చేసుకొంటుందని వాడు ఊహించలేదు. ఊహించి ఉంటే ఆ ప్రయత్నమే చేసి ఉండేవాడు కాదు.

ఆమె ప్రవర్తనలో మార్పు రావడం కోసం, ఆమెను భయపెట్టడం కోసం వాడు ఆ పని చేశాడు.

సులోచన తొందరపడి విశాలను తల్లిలేని పిల్లను చేసి వెళ్ళిపోయింది. అహంకారం ఎక్కువై తన సంసారాన్ని, చివరకు జీవితాన్ని చేజేతులా నాశనం చేసుకొంది'' అంటూ కన్నీళ్ళు తుడుచుకుంది గీత.

నిశ్శబ్దంగా వింటూండిపోయిన అర్చనకూ కళ్ళు చెమర్చాయి.

''సులోచన అలా ప్రవర్తించడానికి కారణమేమై ఉంటుంది'' అంది అర్చన.

''తను మెడిసిన్ చదవాలని ఎంతో ఆశపడింది. కానీ సీటు రాలేదు. దాంతో నిరుత్సాహం, రేస్ట్లెస్నెస్ ఆమెని ఆవహించాయి.

ఇటువంటి సమయంలో సాధారణంగా తల్లిదండ్రులు, స్నేహితుల ఓదార్పు వాళ్ళకు ధైర్యాన్నిస్తాయి.

కానీ ఆమెకు ఎత్తిపొడుపులు, హేళనలు ఎదురైనట్లుంది. అవి ఆమెలో మానసికంగా ప్రాబ్లమ్స్ తెచ్చి చివరకు ఆమే ప్రాబ్లమైంది అందరికీ.

నిజానికి సులోచన తల్లిదండ్రులదే తప్పంటాను నేను. పిల్లల్ని ఏ కార్పొరేట్ కాలేజీలో చేర్పించాలో, ఎంత డబ్బు ఖర్చుచెయ్యాలో ఆలోచిస్తున్నారు కానీ వాళ్ళకు మంచీ, మర్యాదా, వినయం నేర్పడం మరచిపోతున్నారు. నేర్పుదామన్నా పిల్లలు అందుబాటులో లేకుండా పోతున్నారు.

పైగా మిగతా పిల్లల ర్యాంకుల్ని, మార్కుల్ని చూపిస్తూ మానసికంగా వత్తిడి పెంచేస్తున్నారు. అందుకే వాళ్ళు ఎంత బాగా చదువుకొన్నా జీవితంలో చిన్న చిన్న ప్రాబ్లమ్స్‌ను కూడా తట్టుకోలేక ఆత్మహత్య చేసుకొంటున్నారు.

ఈ కాలం తల్లిదండ్రులు అర్థం చేసుకోవాల్సిన విషయం ఒకటుంది. ఐ.ఐ.టి.లో, బిట్స్ పిలానీలో సీట్లు రానివాళ్ళు, మెడిసన్‌లో ర్యాంకు రాని వాళ్ళు కూడా ఆనందంగా జీవిస్తున్నారు. ఉద్యోగాలు చేసుకొంటున్నారు.

ఆశయం ఉండటం మంచిదే కానీ వాటిల్లో సీటు రాకుంటే జీవితమే వేస్ట్ అనే భావన పిల్లల్లో తెస్తున్నారు.

తెలివితేటలు అందరి పిల్లల్లో ఒకే లెవల్లో ఉండవన్న సత్యాన్ని తల్లిదండ్రులు గ్రహించాలి. మా అబ్బాయికి మా ఊర్లోనే ఇంజనీరింగ్‌లో పేమెంట్ సీట్ వస్తే అందరూ నిరుత్సాహపరిచారు నన్ను. నేను మాత్రం వాణ్ణి మంచి వ్యక్తిగా తీర్చిదిద్దడానికి నాకు కావలసినంత సమయం దొరికిందని సంతోషించాను. వాడి ఉద్యోగం గురించి నాకు భయం లేదు. నేను చేస్తున్న మంచి పనుల వల్ల వాడికీ మంచే జరుగుతుందన్న నమ్మకం నాకుంది. తల్లిదండ్రులు పిల్లలపై వత్తిడి తెస్తే దుష్ఫలితాలు ఎదురవుతాయి. సులోచన జీవితం అటువంటి తల్లిదండ్రులకు ఓ పాఠం''

చప్పట్లు వినిపిస్తే ఇద్దరూ ఉలిక్కిపడి చూశారు. కార్తీక్ నిలబడి ఉన్నాడు తలుపు దగ్గర.

''అయిందా నీ స్పీచ్. పదండి భోంచేద్దాం. లాస్ట్ బ్యాచ్ మనదే'' అని ''విశాల్ భోజనం అయింది. మీరు రండి'' అన్నాడు అర్చనతో.

భోజనాలప్పుడు కార్తీక్ తల్లి ఓ ప్రక్క, గీత ఓ ప్రక్క కూర్చొని అభిమానంగా మాట్లాడుతూంటే వాళ్ళు తనకు చాలా ఏళ్ళుగా పరిచయమున్న వ్యక్తుల్లా అనిపించారు అర్చనకి.

''అర్చనా. కార్తీక్ మిమ్మల్ని ఎంతగానో ప్రేమిస్తున్నాడు. మీరు ఒప్పుకుంటే మీ బిడ్డకు తండ్రి అవుతాడు. విశాలకూ తల్లి ప్రేమ లభిస్తుంది. భగవంతుడు ఒక విధంగా మీ యిద్దరికీ అన్యాయం చేశాడు. మిమ్మల్ని కలిపి తన తప్పు దిద్దుకోబోతున్నాడు. నా తమ్ముడి గురించి గొప్పగా చెబుతున్నానని మీరు అనుకోకపోతే చెబుతాను. హి ఈజ్ జెమ్ ఆఫ్ ఎ పర్సన్. ఎ రేర్ పర్సనాలిటీ. ఆలోచించుకోండి'' అంటూ లేచి చేయి కడుక్కోవటానికి వెళ్ళింది.

''అర్చనా. మీ ఇంటి గృహప్రవేశానికి కూడా నేనూ, మా ఆయన పీటల మీద కూర్చోవాలనుకుంటున్నాము'' అంది కార్తీక్ తల్లి లేస్తూ. కార్తీక్ తన తల్లితో కూడా తన గురించి చెప్పాడని అర్థమైంది ఆమెకి.

ఆమె ఎందుకలా చెప్పిందో కూడా అర్థమైంది అర్చనకి. సిగ్గుతో తలదించుకొంది. తలెత్తి చూస్తే ఎదురుగా కార్తీక్ నిలబడి ఉన్నాడు నవ్వుతూ.

''మన ఇంటి గృహప్రవేశానికి కూడా మంచిరోజు చూడండి. మీ అమ్మగారి ఆశ తీరుద్దాం'' అంది అర్చన.

''అయితే అంతకంటే ముందు యింకో మంచి రోజు చూడాలి. మీరు మా యింట్లో 'గృహప్రవేశం' చేయడం కోసం'' అన్నాడు కార్తీక్ సంతోషంగా.

